అంబులెన్స్‌కు ఆపదొచ్చింది

- నిమోనియా సోకిన చిన్నారిని తీసుకెళ్తుండగా పేలిన టైర్ 6
- శ్వాస ఆడక చిన్నారి ఇక్కట్లు..
- సమయానికి వచ్చిన మరో అంబులెన్స్
- మహబూబ్‌నగర్ మండలం బోయపల్లి వద్ద అర్ధరాత్రి ఘటన

పకడ్బందీగా అమలు చేయాలి

- ప్రధాన మంత్రి బీమా యోజనపై బ్యాంకర్లు నిర్లక్ష్యం వీడాలి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి : ఎంపీ మల్లు రవి


మాట్లాడుతున్న మల్లురవి

వనపర్తి అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పేదల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అమలు చేయడంలో బ్యాంకర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని వనపర్తి జిల్లా దిశ కమిటీ ఛైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. సోమవారం వనపర్తి కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మొదటగా బ్యాంకర్ల ద్వారా నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, వాటి లక్ష్య సాధనకు సమీక్ష నిర్వహించారు. ఒక్కో బ్యాంకుకు నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన అంశాలపై లీడ్ బ్యాంకు మేనేజర్, బ్యాంక్ మేనేజర్‌లను వివరాలు అడిగారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి పథకానికి కేవలం సంవత్సరానికి రూ.430 చెల్లిస్తే రూ.2 లక్షల జీవిత బీమా వస్తుందని, అదే ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంలో సంవత్సరానికి కేవలం రూ.20 చెల్లిస్తే పాక్షిక అంగవైకల్యం జరిగితే లక్ష రూపాయలు, శాశ్వత అంగవైకల్యం ఏర్పడితే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. అటల్ బీమా యోజన పెన్షన్ స్కీం

● మిగతా 7వ పేజీలో...

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలించాలి

ప్రజావాణిలో మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి

గైర్హాజరైన 21 మంది పంచాయతీ కార్యదర్శులకు మెమోలు


ప్రజావాణిలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

జడ్చర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ విజయేందిరబోయి ఆదేశించారు. సోమవారం జడ్చర్ల మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఆమె హాజరై పరిశీలించారు. గైర్హాజరైన 21 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఉదయం 10:30కు ప్రారంభమయ్యే కార్యక్రమానికి కలెక్టర్ పది నిమిషాలు ముందే వచ్చారు. కలెక్టర్ వచ్చిన సమయంలో ఎంపీడీవో విజయ్‌కుమార్ మాత్రమే ఉండగా, ప్రజావాణి ప్రారంభ సమయానికి ఒక్కొక్కరు అధికారులు వచ్చారు. కలెక్టర్ గంట పాటు దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. గ్రామ పంచాయతీలలో తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్ యార్డుకు తరలించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కంపోస్టు ఎరువును తయారు చేయాలని, తాను గ్రామాలకు వచ్చిన సందర్భంలో తయారు చేసిన ఎరువును చూపించాలని చెప్పారు. ప్రతీ పది రోజులకు ఒక పర్యాయం ఫాగింగ్ చేయాలని, ఫాగింగ్ మిషన్‌లు రిపేర్ ఉంటే చేయించి సిద్ధం చేసుకోవాలన్నారు. మండలంలోని 40 మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గాను 19 మంది మాత్రమే హాజరయ్యారు. గైర్హాజరైన 21 మంది పంచాయతీ కార్యదర్శులకు మెమోలను జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ప్రజావాణికి ఆలస్యంగా వచ్చిన వారు, గైర్హాజరైన మండల అధికారులు, ఆపై స్థాయి అధికారుల జాబితాను పంపించాలని సూచించారు. ప్రజావాణిలో మునిసిపాలిటీకి సంబంధించి వచ్చిన దరఖాస్తులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై మునిసిపల్ కమిషనర్ రాజయ్యపై కలెక్టర్ విజయేందిరబోయి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 16 దరఖాస్తులు రాగా, ఏ ఒక్క దరఖాస్తుదారుడికి సమాధానం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రజావాణికి ఐదు దరఖాస్తులు రాగా, అందులో రెండు మునిసిపల్, రెండు రెవెన్యూ, ఒకటి ఆర్అండ్‌బీ శాఖలకు సంబంధించినవి వచ్చాయని ఎంపీడీవో విజయ్‌కుమార్ తెలిపారు.

నేటి నుంచి పశువులకు గాలికుంటు నివారణ ఉచిత టీకాలు

పాలమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈ నెల 16 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు పశువులకు గాలికుంటు నివారణ ఉచిత టీకాలు వేయనున్నట్లు జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి బి.మధుసూదన్‌గౌడ్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని గ్రామాల్లో ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తామన్నారు. 49 పశువైద్య సిబ్బంది బృందాలు నెలరోజులపాటు సంబంధిత పశువైద్యాధికారి పర్యవేక్షణలో లక్షా 50 వేల పశువులకు టీకాలు వేస్తారన్నారు.


మానవపాడు మండలం బోరవెల్లి చెన్నకేశవస్వామి ఆలయం

హే..కేశవా మన్నించు

ఇతరుల చేతుల్లో బోరవెల్లి చెన్నకేశవస్వామి ఆలయ భూములు

- గ్రామంలో ఇష్టారాజ్యంగా ఖిద్మతి ఇనాం భూముల విక్రయం
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు.. గ్రామ పెద్దకు భాగం
- అడిగినంత ఇస్తే దేవుడి భూమికైనా యథేచ్ఛగా వోఆర్‌సీలు జారీ
- కారుచౌకగా కొనుగోలు.. వోఆర్‌సీల ద్వారా మ్యూటేషన్లకు పైరవీలు
- భూములు అమ్ముకుంటున్న అనుభవదారులు..
అర్ధాకలిలో అర్చకులు

మహబూబ్‌నగర్/అలంపూర్ చౌరస్తా(ఆంధ్రజ్యోతి ప్రతినిధి), అక్టోబరు 14: జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆలయాల భూములు అంగట్లో సరుకుగా మారుతున్నాయి. జిల్లాలోని మానవపాడు మండలం బోరవెల్లి గ్రామంలో గద్వాల సంస్థాన స్థాపకుడైన నలసోమనాద్రి చెన్నకేశవస్వామి ఆలయాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. దూపదీప నైవేద్యాల కోసం గ్రామంలోని సర్వే నెంబర్ 240/ఏ, 241, 269, 270/ఏ, 270/బీ, 294, 295లో మొత్తం కలిపి 62.26 ఎకరాలను కేటాయించారు. ఈ భూములన్నింటికి దేవుళ్ల పేర్లపై ఓఆర్‌సీలు సైతం జారీ అయ్యాయి. ఖిద్మతిఇనాం భుములుగా 1953-1955 ఖాస్రపహాణీలో నమోదై ఉన్నాయి. 1955 చట్టం ప్రకారం ఈ భూములను విక్రయించడానికి వీలు లేదు. గతంలో ఆ భూముల ద్వారా వచ్చే పైకంతో కైంకర్యాలు బాగా నిర్వహించేవారు. కానీ క్రమేణా కౌలు చేస్తున్న రైతులు కూడా పైకం అరకొరగా చెల్లించడం, కొందరు చెల్లించకపోవడం, ఎండోమెంట్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అనుభవదారులు భూముల విక్రయాలకు

ఆనాటి రాజులు, భూస్వాములు ఆలయాల బాగు కోసం, దూపదీప నైవేద్యాల కోసం ఆలయాలకు భూములను అప్పగించారు. అయితే అందరికీ అభయమిచ్చే ఆ దేవుడి భూములనే కొందరు కాజేస్తున్నారు. భూములపై ఆధారపడి జీవించాల్సిన వారు.. వాటిని విక్రయించి ఆలయాల ఉనికే లేకుండా చేస్తున్నారు. భూములను పరిరక్షించాల్సిన అధికారులు వీరికంటే ఒక అడుగు ముందుకేసి చేయిచాస్తున్నారు. అడిగినంత చేతిలో పెడితే ఆలయ భూములను బదలాయించే ధ్రువపత్రాలను జారీ చేస్తున్నారు. ఇలా మొన్న చెన్నిపాడులో.. నిన్న పెద్దదిన్నెలో.. తాజాగా బోరవెల్లిలో ఆలయ భూములను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు వోఆర్‌సీలను జారీ చేస్తూనే ఉన్నారు.

● మిగతా 7వ పేజీలో...

న్యూస్ బాక్స్

నేటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల అనంతరం మంగళవారం నుంచి పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఈ నెల 2 నుంచి 14 వరకు పాఠశాలకు విద్యాశాఖ దసరా సెలువులు ప్రకటించింది. నేటి నుంచి పాఠశాలలు ఓపెన్ కానుండటంతో విద్యార్థులతో కళకళలాడనున్నాయి. ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ -1(ఎస్ఏ-1) పరీక్షలు ఈనెల 21 నుంచి నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా పరీక్షల విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన ప్రశ్నపత్రాలతో పరీక్షలు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కనుల పండువగా శోభాయాత్ర



మరికల్/మక్తల్ రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ పట్టణంలో దుర్గామాత శోభాయాత్ర సోమవారం కనుల పండువగా సాగింది. పట్టణంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి, కాళికామాత ఆలయాల్లో 12వ రోజు దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పోసిన ఒడి బియ్యాన్ని వండి అన్నదానం చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, చేసి తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం అమ్మవారి ప్రతిమను ట్రాక్టర్‌పై ఉంచి శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో మహిళలు, చిన్నారుల బతుకమ్మ ఆటలు ఆకట్టుకున్నాయి. అనంతరం పుష్కరిణిలో అమ్మవారిని నిమజ్జనం చేశారు.

● మక్తల్ పట్టణంలోనూ వాసవీమాత ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు తొమ్మిది రోజుల పాటు ఘనంగా పూజలందుకున్నారు. దాండియా నృత్యాలు, బతుకమ్మ పాటలు, భజనలతో పురవీధుల గుండా శోభాయాత్ర సాగింది.

మేఘమై నేను వచ్చాను..

ఈ ఫొటో చూస్తుంటే.. ఓ సినిమాలోని 'మేఘమై నేను వచ్చాను..' అనే పాట గుర్తొస్తుంది కదూ.. మేఘాలు సమూహంగా వచ్చి నీటి అద్దంలో తమ ప్రతిబింబం చూసుకొని మురిసిపోతున్నట్లున్న ఈ దృశ్యం నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొండారెడ్డిపల్లి చెరువు వద్ద సోమవారం కనిపించింది. ఈ సుందర దృశ్యాన్ని చూసిన పలువురు నేత్రానందం పొందారు. 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- నారాయణపేట




నారాయణపేటలో సాగు చేసిన పత్తి పంట

ఏడు కొనుగోలు కేంద్రాలు

- నారాయణపేట జిల్లాలో ఏర్పాటుకు సీసీఐ సన్నాహాలు
- పత్తి క్వింటాల్‌కు రూ.7,521 మద్దతు ధర
- జిల్లాలో 1,65,150 ఎకరాల్లో సాగు

నారాయణపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా వ్యాప్తంగా సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కోసం ఏడు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. 2024- 25 వానా కాలానికి సంబంధించి జిల్లాలో 1,65,150 లక్షల ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేశారు. 9,90,900 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలోని నారాయణపేట మండలంలోని అప్పక్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ధన్వాడ సమీపంలో లింగంపల్లి, మక్తల్ మండలం లింగంపల్లి, గుడిగండ్ల, మాగనూర్ మండలం వడ్వాట్, ఊట్కూర్ మండలం తిప్రస్‌పల్లి, దామరగిద్ద మండలం ఉల్లిగుండం గ్రామాల్లో జిన్నింగ్ మిల్లుల దగ్గర సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేయనున్నారు. మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటాల్ పత్తి ధర కనిష్ఠంగా రూ.5,800 నుంచి గరిష్ఠంగా రూ.7,300 వరకు ఉంది. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కేంద్రం మద్దతు ధర రూ.7,521గా నిర్ణయించింది. నిబంధనల ప్రకారం తేమ 12 శాతానికి మించొద్దు. అయితే మొదట్లో నెలకొన్న వర్షాభావం, ఆ తర్వాత అధిక వర్షాలతో పాటు తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గుతుందని రైతులు అంటున్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఇటీవల పత్తి కొనుగోళ్లకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని మార్కెటింగ్, సీసీఐ, వ్యవసాయ అధికారులతో సమీక్షించారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో జాప్యం జరుగుతుండటంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. మిల్లుల ఎంపిక జరిగిందని, కొనుగోలు కేంద్రాలు త్వరలో ప్రారంభం అవుతాయని అధికారులు చెబుతున్నారు.


పత్తి కొనుగోలుపై అధికారులతో సమీక్ష చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్(ఫైల్)

ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు


అధికారులతో మాట్లాడుతున్న డీఈవో రవీందర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ -2024కు ఎంపికైన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డీఈవో రవీందర్ తెలిపారు. సోమవారం ఆయన తన చాంబర్ నిర్వహించిన సమావేశంలో డీఈవో కార్యాలయ ఏడీ, సూపరింటెండెంట్, ఎంఈవోలు, కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో డీఎస్సీకి ఎంపికైన 196 మంది ఉపాధ్యాయ అభ్యర్థులకు మంగళవారం కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఉదయం తొమ్మిది గంటల వరకు కలెక్టరేట్‌కు రావాలని సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం అభ్యర్థులకు ప్లేస్ కేటాయించి, నియామక పత్రాలు అందించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 16న పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు.

సమాచారం

కోస్గికి కొత్త బస్సులు

కోస్గి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కోస్గి బస్‌డిపోకు త్వరలో కొత్త బస్సులు రానున్నాయా? అంటే అవునన్న సంకేతాలు కన్పిస్తున్నాయి. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం.. దానికితోడు ముఖ్యమంత్రి ప్రత్యేకంగా తెచ్చిన డిపో కావడంతో బస్సులు ఎందుకు రావడం లేదన్న విమర్శలు వస్తుండడంతో అధికారులు స్పందించారు. మహబూబ్‌నగర్ ఆర్ఎం శ్రీదేవి ఇప్పటికే నారాయణపేట, మహబూబ్‌నగర్, తాండూర్, పరిగి డిపోల నుంచి సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు కోస్గి డిపోలో పని చేసేందుకు విల్లింగ్ ఉంటే రావాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంపై సోమవారం ఆయా డిపోల డీఎంలతో సమావేశమైనట్లు తెలుస్తోంది. సిబ్బంది కోస్గికి రావడానికి ముందుకు వస్తే త్వరలో కోస్గికి కొత్త బస్సులు రానున్నాయి. దీంతో ప్రతీ గ్రామానికి కోస్గి నుంచి బస్ సౌకర్యం ఉండనుంది.

న్యూస్ బాక్స్

ఆటో డ్రైవర్ నిజాయతీ

- ప్రయాణికుడు మరిచిన బ్యాగు అందజేత



యజమానికి బ్యాగును అందచేస్తున్న ఆటో డ్రైవర్ మున్నా

జడ్చర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నగదు, విలువైన ఏటీఎం కార్డులు, ఇతర వస్తువులు ఉన్న బ్యాగును జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి సమక్షంలో బ్యాగు యజమానికి ఆటో డ్రైవర్ అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. ఈ సంఘటన సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల లో చోటు చేసుకుంది. కర్నూలు పట్టణానికి చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి జడ్చర్లలో ఆ టోలో తన బ్యాగు మరిచిపోయి దిగిపోయా డు. వెంటనే తేరుకుని జడ్చర్ల పోలీస్‌స్టేష న్‌లో ఫిర్యాదు చేశాడు.

ఫిర్యాదు మేరకు వెంటనే ఆటో యూనియన్ సభ్యులకు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి సమాచారం అందించారు. ఆటోలో మరిచిన బ్యాగును ఆటో డ్రైవర్ మున్నా, యూనియన్ అధ్యక్షులు హాజీతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐ సమక్షంలో సంబంధిత యజమానికి అప్పగించారు. నిజాయతీని చాటుకున్న ఆటో డ్రైవర్‌ను సీఐ అభినందిచారు.

ఇద్దరు నిందితులకు రిమాండ్

గద్వాల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మండల పరిధిలోని పూడూరు గ్రామంలో మూడు రోజుల క్రితం బోయ బీచుపల్లి ఇంట్లో దొంగతనం జరిగింది. దొంగతనానికి పాల్పడిన రాఘవేందర్ అనే నిందుతుడిని పట్టుకొని కోర్టులో హాజరు పర్చగా న్యాయస్థానం 14రోజుల రిమాండ్ విధించిందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మరో కేసులో నాలుగు రోజుల క్రితం పూడూరు గ్రామం మీదుగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేశామని, అందులో ప్రధాన నిందితుడు అయిన జంగయ్య అలియాస్ జనార్ధన్‌ను పట్టుకొని కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు జుడిషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు.

సినిమా పాటల 'అల'



ఏకాంతంగా కూర్చొని పాటలు రాస్తున్న అలరాజు

- 'ప్రతిక్షణం' సినిమాతో అలరాజు అరంగేట్రం
- క్రేజీ ఫెలో చిత్రానికి పాటలు రాసి ప్రశంసలు

సినిమా ప్రపంచంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవడమే ఆయన ధ్యేయం.. 'ప్రతిక్షణం' సినిమాతో పాటల రచయితగా అరంగేట్రం చేశారు. క్రేజీ ఫెలో సినిమాతో ప్రశంసలందుకున్నారు. దీంతో పలు చిత్రాలకు పాటలు రాసే అవకాశం లభించింది. నేను ఎంచుకున్న పనిని అంకిత భావంతో చేస్తానని అంటున్నారు. ఆయనే నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రానికి చెందిన అలరాజు.. సినీ గేయ రచయితగా పేరు తెచ్చుకుంటున్న ఆయనతో 'ఆంధ్రజ్యోతి' ముచ్చటించింది. వివరాలు మీకోసం...

- అచ్చంపేట, ఆంధ్రజ్యోతి

పాటంటే ఆయనకు ప్రాణం.. రచననే వృత్తిగా స్వీకరించారు. నిరంతరం అక్షరాలే శ్వాసగా, పల్లవి, చరణాలే శ్వాసగా సినిమాలకు గేయాలు రాస్తూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రానికి చెందిన రైతు గోరోజి, సుగుణమ్మ దంపతులకు నలుగురు సంతానం ఉన్నారు. వారిలో మూడవ వాడు అలరాజు. ఆయనకు ఇద్దరు అక్కలు, ఒక్క అన్న ఉన్నారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు పదరలోనే చదువుకున్నాడు. ఆ తర్వాత అమ్రాబాద్‌లో ఇంటర్, కొండనాగులలో డిగ్రీ, హైదరాబాద్‌లో ఎంఏ పూర్తి చేశారు. ఆయనకు చిన్నతనం నుంచే సినిమాలపై ఆసక్తి ఉంది. ఎలాగైనా సినిమా రంగంలో తనకంటూ గుర్తింపును తెచ్చుకోవాలనుకున్నాడు. అందుకు రచనా వ్యాసంగాన్ని వృత్తిగా ఎంచుకున్నారు. గేయ రచయితగా పలు సినిమాలకు పాటలు రాశారు. ఎన్నో ఒడిదుడుకుల మధ్య అవకాశాలు దక్కించుకుంటూ దర్శకులు, నిర్మాతల మన్ననలు పొందుతున్నారు.

'ప్రతిక్షణం'తో తొలి అడుగు

అలరాజుకు మొదటిసారిగా ప్రతిక్షణం అనే సినిమాలో అన్ని పాటలు రాసే అవకాశం లభించింది. ఆ తర్వాత మనక్కులి చిత్రానికి పాటలు రాశారు. ప్రముఖ నటుడు మంచు విష్ణు హీరోగా నటించిన 'తిప్పరా మీసం'తో పాటు, ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ సంగీత సారథ్యంలో వచ్చిన ప్రేమదేశం వంటి చిత్రాలకు ఆయన రాసిన పాటలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి. ప్రముఖ సీనినటుడు సాయికుమార్ తనయుడు ఆది హీరోగా నటించిన క్రేజీఫెలో చిత్రానికి కూడా ఆయనే పాటలు రాశారు. వాటితో పాటు ఆయన



సినీ గాయకులు మంగ్లీ, రమ్యలతో అలరాజు

పాటలు రాసిన తంత్ర, లంబసింగి చిత్రాలు ఇటీవలే విడుదలయ్యాయి. తంత్ర సినిమాలోని ధీరే ధీరే అనే పాటకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. అంతే కాకుండా ప్రముఖ దర్శకుడు కె. విజయ భాస్కర్ ఆధ్వర్యంలో తీసిన ఉషా పరిణాయం సినిమాకు కూడా ఆయన పాటలు అందించారు.

ప్రశంసలందుకున్న 'తెలియదే.. తెలియదే'

'ఫైల్స్ ఆఫ్ లవ్' చిత్రం కోసం ఆయన రాసిన 'తెలియదే.. తెలియదే..' పాటను ప్రముఖ గాయకుడు సిద్ శ్రీరాం పాడారు. ఈ పాటను యూట్యూబ్‌లో దాదాపు ఐదు కోట్ల మంది వీక్షించారు. ఇదే సినిమాలో ఆర్ఆర్ ధ్రువణ్ సంగీత సారథ్యంలో వెలువడిన ఆయన రాసిన 'గగనమ్ము దాటి' పాటకు కూడా మంచి ఆదరణ లభించింది. వీటితో ఆయన పాటలు రాసిన మరికొన్ని సినిమాలు కూడా విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. నేను పుట్టిన నల్లమల ప్రాంతానికి గుర్తింపు తేవాలన్నదే తన లక్ష్యమని ఆయన అంటున్నారు.



అలరాజు రాసిన ఉషాపరిణయం చిత్ర ఆడియో రిలీజ్ ఫంక్షన్‌లో..

విజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఫిర్యాదు

జడ్చర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మైన్స్ శాఖ జిల్లా ఏడీగా విధులు నిర్వహించి, జనగామ జిల్లా ఏడీగా బదిలీ అయిన విజయ్‌కుమార్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారికి జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆ ప్రతులకు సంబం ధించి ప్రెస్‌నోట్‌ను సోమవారం జడ్చర్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేశారు. బాలానగర్ మండల కేంద్రంలోని సర్వే నెంబరు 118/పి భూమిలో వారాహి అనే ప్రైవేటు సంస్థకు భారీ స్థాయిలో మట్టిని తర లించిందని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న పెద్దచెరువు కాల్వను పూడ్చివేసి, కాల్వ దిశను మళ్లించిందంటూ క్షేత్ర స్థాయిలో విలేకరుల సమావేశంలో ఫిబ్రవరి నెలలో ఎమ్మెల్యే వెల్లడించిన అంశాన్ని పత్రిక ప్రకటనలో వివరించారు. ఈ వ్యవహారంపై అప్పటి జిల్లా మైన్స్ ఏడీగా విధులు నిర్వహించిన విజయ్‌కుమార్ విచారణ చేపట్టి, అక్రమంగా మట్టి తరలింపునకు సంబంధించి ప్రభుత్వానికి రూ.ఐదు కోట్ల 12లక్షలు సీనరేజ్ చార్జీలు చెల్లించాలని నోటీసులు జారీ చేశారని తెలిపారు.

మహబూబ్‌నగర్ నుంచి జనగామకు బదిలీ అయిన సందర్భంలో బదిలీపై వెళ్లే ఒక్క రోజు ముందు.. వారాహి సంస్థకు రూ.5 కోట్ల 12లక్షల సీనరేజ్ చార్జీలు చెల్లించాల్సిన మొత్తాన్ని మాఫీ చేస్తూ తాను జారీ చేసిన నోటీసులను రద్దు చేశాడని వివరించారు. ఈ అక్రమాలపై లోతుగా దర్యాప్తు చేయాలంటూ ఉన్నత అధికారులను కోరడంతో నలుగురు ఉన్నత అధికారులతో జిల్లా కలెక్టర్ ఒక ఫోర్‌మెన్ కమిటీని నియమించిందన్నారు. మహబూబ్‌నగర్ ఆర్డీవో నవీన్, ఇరిగేషన్ ఈఈ ఉదయ్‌శంకర్, సర్వే లాండ్ రికార్డ్స్ ఏడీ కృష్ణారావు, మైన్స్ డీడీ నరసింహారెడ్డిల ఫోర్‌మెన్ కమిటీ విచారణ చేపట్టిందన్నారు. వారాహి సంస్థ లక్షా 67వేల టన్నుల మట్టిని ఇతర ప్రాంతాలలో తవ్వి తీసుకువచ్చినట్లుగా నిర్ధారించారని తెలిపారు. వారాహి సంస్థ అక్రమాలు నిరూపణ అయ్యాయని, వారాహి సంస్థకు పత్తాసు పలికి తాను బదిలీపై వెళ్లే ఒక్క రోజు ఆ సంస్థకు అనుకూలంగా ఉత్తర్వులను జారీ చేసిన మైన్స్ ఏడీ విజయ్‌కుమార్‌ను తక్షణం విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో నిర్ణయించిన విధంగా వారాహి సంస్థతో రూ. ఐదు కోట్ల 12 లక్షలను రాబట్టాలని చీఫ్ సెక్రటరీని కోరినట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీసీ రీజియన్‌కు 104 శాతం ఆక్యుపెన్సీ

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఆర్టీసీ రీజియన్ 104 శాతం ఆక్యుపెన్సీ సాధించి రాష్ట్రంలోని 11 రీజియన్‌లలో ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు మొదటి స్థానంలో నిలిచిందని ఆర్ఎం శ్రీదేవి తెలిపారు. అలాగే రీజియన్ పరిధిలోని పది డిపోలలో మూడు డిపోలు అత్యధిక ఈపికె, ఓఆర్ సాధించినందుకు ఆర్టీసీ ఎండీ, ఆర్.ఎం. ఆయా డిపోల డిపో మేనేజర్లను, ట్రాఫిక్ సూపర్‌వేజర్లను, ఇతర సిబ్బందిని ముఖ్యంగా డ్రైవర్, కండక్టర్లను ప్రత్యేకంగా అభినందించారు. మహబూబ్‌నగర్ రీజియన్‌లోని నాగర్‌కర్నూల్ 67.1 ఈపికె, 114.3 ఓఆర్, వనపర్తి డిపో 65.35 ఈపికె, 110.69 ఓఆర్ సాధించిందని, గద్వాల 63.67 ఈపికె, 108.62 ఓఆర్ సాధించిందని తెలిపారు. ఈ 11 రోజుల్లో రీజియన్ పరిధిలో 4.48 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో వారివారి ఊళ్లకు చేరుకున్నారని, వారందరి కొరకు తిరుగు ప్రయాణానికి ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా అన్ని బస్టాండ్లలో సౌకర్యాలు, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు 24 గంటలు ఉండేలా ప్రణాళిక రూపొందించి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

దసరా స్పెషల్ ఆపరేషన్స్ సందర్భంగా ఈ నెల 13 నుంచి 16 వరకు రిటర్న్ ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా ఉమ్మడి జిల్లాలోని పది డిపోల నుంచి అదనపు సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. 13 నుంచి 16 వరకు డిపోల వారిగా హైదరాబాద్‌కు నడిపే ప్రత్యేక బస్సు లు అచ్చంపేట 23, గద్వాల 22, కల్వకుర్తి 22, కొల్లాపూర్ 23, మహబూబ్‌నగర్ 30, నాగర్‌కర్నూల్ 20, నారాయణపేట 22, షాద్‌నగర్ 21, వనపర్తి 27 కలిపి 210 బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు అందరూ సహకరించాలి

- ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్

దోమలపెంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతీ ఇక్కరు బాధ్యతగా భావించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని దోమలపెంట ఎఫ్ఆర్‌వో గురుప్రసాద్ అన్నారు. సోమవారం శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న వటువర్లపల్లిలో హోటల్స్ దాబాలలో తనిఖీలు నిర్వంహించి వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్, చిప్స్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్రాబాద్ అభయారణ్యం ప్రాంతంలో ప్లాస్టిక్ నిర్మూలనకు అటవీశాఖ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందన్నారు. జూలై ఒకటి నుంచి నిబంధనలు అమలు పర్చినా వ్యాపారులు పెడచెవిన పెడుతూ ప్లాస్టిక్ వాడకంతో ఉన్న తినుబండారాలను విక్రయిస్తున్నారన్నారు. గతంలో వ్యాపారులకు నోటీసులు ఇచ్చినా వారిలో మార్పు లేకపోవడంతో సోదాలు నిర్వహించి వివిధ రకాల ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేకున్నామన్నారు. ఇకముందు ఇలాగే కొనసాగితే జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. ఎఫ్ఎస్‌వో ధర్మ, గోపాల్, ఎఫ్ఎస్‌వో భీముడు, కార్తీక్, వెంకటేష్, సుమలత సిబ్బంది ఉన్నారు.



వటువర్లపల్లిలో కూల్‌డ్రింక్స్‌ను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

సుంకేసుల డ్యాంకు పెరిగిన వరద

- 92 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో... 90 వేల క్యూసెక్కుల ఔట్ ఫ్లో

రాజోలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాజోలి శివారులోని సుంకేసుల డ్యాంకు వరద ప్రవాహం పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షం కారణంగా సోమవారం డ్యాంకు 92,950 క్యూసెక్కుల వరద వస్తుండటంతో డ్యాం 22 గేట్లు ఎత్తి 90,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం జేఈ రాజు తెలిపారు. మరో రెండు రోజుల పాటు వరద పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. డ్యాం సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.917 టీఎంసీ నీరు నిల్వ ఉందన్నారు. డ్యాం గరిష్ట నీటిమట్టం 292.00 మీటర్లు కాగా, ప్రస్తుతం 291.20 నీటిమట్టం నమోదు అయినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా జూరాల డ్యాంకు కూడా ఎగువ నుంచి కాస్త వరద పెరిగినట్లు అధికారులు తెలిపారు.



సుంకేసుల డ్యాం నుంచి విడుదల అవుతున్న నీరు

అంబులెన్స్‌కు ఆపదొచ్చింది

- నిమోనియా సోకిన చిన్నారిని తీసుకెళ్తుండగా పేలిన టైర్
- శ్వాస ఆడక చిన్నారి ఇక్కట్లు.. సమయానికి మరో అంబులెన్సు
- బోయపల్లి లో అర్ధరాత్రి ఘటన



అంబులెన్సులోనే ఉన్న చిన్నారి

నవాబ్‌పేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో వైద్య సేవలందించే అంబులెన్సుకే ఆపదొచ్చింది. వైద్యం కోసం అర్ధరాత్రి ఆసుపత్రికెళ్తున్న ఓ చిన్నారికి గంట పాటు ఇబ్బందులు తప్పలేదు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణ కేంద్రానికి చెందిన వెంకటేష్ అనే యువకుడు తన కుటుంబ సభ్యులతో కలిసి దసరా పండుగకు నవాబ్‌పేట మండలం యన్మనగండ్ల గ్రామంలో ఉన్న తన చెల్లెలు అనుషమ్మ ఇంటికి పిల్లాపాపలతో వచ్చారు. అందరూ కలిసి సంతోషంగా పండుగ జరుపుకున్న తర్వాత రాత్రి ఒంటి గంట ప్రాంతంలో వెంకటేష్ కుమారుడు సాత్విక్‌కు వాంతులు, విరేచనాలు కావడంతో ఆందోళన చెందారు. దీంతో నవాబ్‌పేట ప్రాథమిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చి అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి వెళ్తుండగా.. మహబూబ్‌నగర్ మండలం బోయపల్లి సమీపంలోకి రాగానే అంబులెన్సు ముందు టైరు పేలిపోయింది. సుమారు గంటపాటు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. అందులో ఉన్న చిన్నారి సాత్విక్ శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో బాలుడి తండ్రి వెంకటేష్ తన బంధువులు, స్నేహితుల సహకారంతో గంట తర్వాత మరో అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. ఇదిలా ఉంటే, గత మూడు నెలలుగా అంబులెన్సు మొరాయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని 108 సిబ్బంది రోగి కుటుంబ సభ్యులతో వాపోయినట్లు సమాచారం.



అచ్చంపేట మండలం పెనిమిల్ల గ్రామం నడిబొడ్డులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



పెనిమిల్ల గ్రామం నడిబొడ్డులో పేర్చిన బతుకమ్మలు



మేళ తాళాలతో బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

ఆడారు.. పాడారు..

- పెనిమిళ్లలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు
- పాల్గొన్న అచ్చంపేట సివిల్ న్యాయాధికారి విజయ్ కుమార్

అచ్చంపేట/కల్వకుర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలం పెనిమిళ్ల గ్రామంలో సద్దుల బతుక మ్మ ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. తెలంగా ణ వ్యాప్తంగా విజయదశమి నాటికి బతుకమ్మ సంబురాలు ముగిసినా ఉప్పునుంతల మండలం పెనిమిల్ల గ్రామంలో మా త్రం దసరా మరుసటి సద్దుల బతుకమ్మ ఉత్సవాలను జరుపు కోవడం ఆనవాయితీగా వస్తుంది. సద్దుల బతుకమ్మ ఉత్సవాలలో అచ్చంపేట సివిల్ న్యాయాధికారి విజయ్ కుమార్ పాల్గొనగా, అచ్చంపేట ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ చిక్కుడు అనురాధ మహిళలతో కలిసి ఆడిపాడారు. సాయంత్రం మూడు గంటల నుంచి రాత్రి 7గంటల వరకు గ్రామం నడిబొడ్డులో పెద్ద ఎత్తున యువతులు, మహిళలు బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొని ఆడిపాడారు. బతుకమ్మ సంబురాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున ప్రజలు చేరుకుని ఆనందం వ్యక్తపరిచారు. అనంతరం బ్యాండు మేళాలతో సమీపంలో ఉన్న దుందుభీ నదికి చేరుకుని అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గౌరమ్మ గంగానదిలో నిమజ్జనం చేశారు. ఈ బతుకమ్మ సంబురాలలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్, మారం భూపాల్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ మారం సురేష్ రెడ్డి, యువకులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



బతుకమ్మతో కల్వకుర్తి పుర చైర్మన్ ఎడ్మ సత్యం దంపతులు

కల్వకుర్తిలో...

కల్వకుర్తి పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకలకు పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వివిధ రకాల పూలతో తయారు చేసిన బతుకమ్మలను మహిళలు నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా పట్టణ సమీపంలోని కపిలేశ్వరస్వామి గుట్ట వద్దకు తరలివచ్చారు. బతుకమ్మలతో సందడి చేశారు. సద్దుల బతుకమ్మ వేడుకలకు నిర్వాహకులు విశాల వసతులు కల్పించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ షాహీద్, మాజీ మునిసిపల్ చైర్మన్ రాచోటి శ్రీశైలం, మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఉరుకులు పరుగుల జీవితాల్లో కొంత ప్రశాంతత, ఉపాధి, ఉద్యోగాల్లో అలసి సొలసి పోతున్న శరీరానికి హాయినిచ్చే చల్లగాలి... దైనందిన జీవితంలో ఒత్తిడికి గురవుతున్న మనసుకు కొంత సాంత్వన అవసరం.. అందుకు 'మార్నింగ్ వాక్' దివ్య ఔషధం అంటున్నారు యువతీ యువకులు.. వయసు పెరగడంతో వచ్చే అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు 'ఉదయపు నడక'ను మించినది మరేదీ లేదంటున్నారు సీనియర్ సిటిజన్లు.. గద్వాల, నాగర్‌కర్నూల్ పట్టణాల్లో కొందరు మార్నింగ్ వాకర్స్‌ను 'ఆంధ్రజ్యోతి' పలుకరించింది. ఆ వివరాలతో 'ప్రత్యేక కథనం' మీ కోసం...

- గద్వాల టౌన్/ నాగర్‌కర్నూల్ టౌన్ (ఆంధ్రజ్యోతి)

నడక మంచిదే



- మార్నింగ్ వాక్‌తో సంపూర్ణ ఆరోగ్యం
- ఏళ్ల తరబడి కొనసాగిస్తున్న సీనియర్ సిటిజన్లు
- శారీరక దృఢత్వంపై యువతీ, యువకుల శ్రద్ధ
- ఉదయపు నడక, వ్యాయామంపై ప్రత్యేక దృష్టి

30 ఏళ్లుగా ఉదయం నడక



వృత్తిరీత్యా వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహించిన నాకు మార్నింగ్ వాక్ వల్ల ఒనగూరే ప్రయోజనాలపై స్పష్టత ఉంది. మూడు దశాబ్దాల నుంచి ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా నడవటం అలవాటుగా మార్చుకున్నాను. ఇప్పటి వరకు మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడలేదు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు మార్నింగ్ వాక్‌తో గరిష్ఠంగా ఉపశమనం పొందే అవకాశం ఉంటుంది. దానికి తోడు డైట్ కంట్రోల్ పాటించాలి. నేను ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాను.

- మల్లికార్జున్, రిటైర్డ్ వైద్యాధికారి



నాగర్‌కర్నూల్‌లోని జడ్పీ మైదానంలో కలిసి వ్యాయామం చేస్తున్న వాకింగ్ వండర్ సభ్యులు

పెట్టుబడి లేని టానిక్



ప్రతి రోజు నడకతో పాటు వ్యాయామం చేయడం పెట్టుబడి లేని టానిక్ లాంటిది. ఆరోగ్యమే అసలైన సంపద. తామంతా కలిసి నడుస్తూ మానసిక, శారీరక ఉల్లాసాన్ని పొందుతున్నాం.

- కొత్త శ్రీనివాసులు, కౌన్సిలర్

దైనందిన జీవితంలో ఒత్తిడిని అధిగమించేందుకు, బీపీ, షుగర్‌ల బారిన పడకుండా ఉండేందుకు, ఇప్పటికే షుగర్ బారిన పడిన వారు, దానిని నియంత్రణలో ఉంచుకునేందుకు, మొత్తంగా ఆరోగ్య పరిరక్షణకు 'నడక మంచిదే' అంటున్నారు యువతీ యువకులు. మార్నింగ్ వాక్‌ను వారు దినచర్యలో భాగంగా మార్చుకుంటున్నారు. అలాగే సీనియర్ సిటిజన్లు ఉదయపు నడకను ఏళ్ల తరబడి నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. ఇలా వయసుతో సంబంధం లేకుండా 20 ఏళ్ల యువకుడి నుంచి 80 ఏళ్ల వయోవృద్ధుల వరకు నడకను దినచర్యలో భాగంగా మార్చుకుంటున్నారు. కొందరు ఏళ్ల తరబడి మార్నింగ్ వాక్‌ను క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నారు. మరి కొందరు మరికొందరు మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడి, వైద్యుల సూచన మేరకు మార్నింగ్ వాక్ చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం, తేరు మైదానం, స్మృతి వనం, పట్టణ ప్రకృతి వనాల్లో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌లు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్‌తో సందడిగా మారుతున్నాయి. అలాగే రాయచూరు, అయిజ, జూరాల డ్యాం, నదీ అగ్రహారం వైపు నడకను కొనసాగిస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతూనే ఉంది.

నాగర్‌కర్నూల్‌లో 'వాకింగ్ వండర్'

ఆరోగ్యవంతమైన జీవనమే లక్ష్యంగా నాగర్ కర్నూల్ పట్టణానికి చెందిన కొందరు 'వాకింగ్ వండర్' అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో, జిల్లా పరిషత్ మైదానం కేంద్రంగా 2017లో ఏర్పాటైన ఈ అసోసియేషన్ ఆరోగ్యం, స్నేహం, సేవా భావాలకు గొప్ప ఉదాహరణగా నిలుస్తోంది. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం నడక కోసం మైదానానికి వచ్చే కొందరితో ప్రారంభమైన వాకింగ్ వండర్‌లో ప్రస్తుతం సభ్యుల సంఖ్య 70కి చేరింది. వారిలో ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారున్నారు. వారు ప్రతీ రోజు ఉదయం నడక, వ్యాయామంతో పాటు, మానసిక ఆరోగ్యం కోసం లాఫింగ్, ధ్యానం కొనసాగిస్తున్నారు. సభ్యుల పుట్టిన రోజు వేడుకలను మైదానంలోనే నిర్వహిస్తున్నారు. వీరంతా డ్రెస్ కోడ్ కూడా పాటిస్తున్నారు. వారంలో ఐదు రోజులు బ్లూ టీ షర్టులు, శని, ఆది వారాల్లో మెరూన్ టీ షర్టులు ధరిస్తున్నారు.

సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు

వండర్ అసోసియేషన్ సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటోంది. సభ్యుల్లో ఎవరికి ఆరోగ్య సమస్య వచ్చినా ఆర్థిక సహాయం అందిస్తూ చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా మైదానంలో జాతీయ పతాకావిష్కరణ, ప్రముఖుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. మొక్కలు నాటుతున్నారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న ఉత్సవ కమిటీలకు విరాళం ఇస్తున్నారు.



గద్వాల పట్టణంలో వాకింగ్ చేస్తున్న సీనియర్ సిటిజన్లు

25 ఏళ్లగా నడక అలవాటు



గద్వాలకు 30 ఏళ్ల క్రితం వచ్చి స్థిరపడ్డాము. 1999 నుంచి మార్నింగ్ వాక్ కొనసాగిస్తున్నాను. 12 ఏళ్ల క్రితం గుండెకు శస్త్రచికిత్స జరిగింది. కొన్నాళ్ల విశ్రాంతి అనంతరం, వైద్యుల సలహా మేరకు యథావిధిగా మార్నింగ్ వాక్ చేస్తున్నాను. ప్రతీ ఒక్కరు మార్నింగ్ వాక్‌ను అలవాటు చేసుకోవాలి.

- బలిగెర నారాయణ రెడ్డి, గద్వాల

నడకతో ఆరోగ్య పరిరక్షణ



నడకతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంతో పాటు, సమాజంలో స్నేహం, సేవా భావాలను పెంపొందించేందుకు వాకింగ్ వండర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నాం. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. అలాగే సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తాం.

- పడిగె తిరుపతయ్య, వాకింగ్ వండర్ అధ్యక్షుడు

ఐక్యతను చాటేందుకు డ్రస్ కోడ్



అసోసియేషన్ సభ్యుల్లో సోదర భావం, ఐక్యతను చాటుకునేందుకు డ్రస్‌కోడ్ ఏర్పాటు చేసుకున్నాం. అందుకు నా వంతుగా సభ్యులందరికీ కోడ్‌కు అనుగుణంగా టీ షర్టులు అందించాను. ఎన్ని పనులున్నా ఉదయం మాత్రం సభ్యులతో కలిసి నడకను కొనసాగిస్తున్నా.

- పాలమూరు యాదయ్య, సభ్యుడు

హే..కేశవా మన్నించు



సర్వే నెంబరు 295లోని కేశవస్వామి ఆలయ భూమి

(మొదటి పేజీ తరువాయి)

పాల్పడ్డారు. ఇనాందారులు తప్పుడు ధ్రువ పత్రాలు సృష్టించి, అధికారులకు ఆమ్యామ్యాలిచ్చి.. రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకుని తమ పేర్ల నుంచి ఇతరులకు విక్రయించారు. వీటిలో కొన్ని ధరణి పోర్టల్‌లో కూడా నమోదు కాగా, మరికొన్ని దేవుడిపేరుపైనే కనిపిస్తున్నాయి. ఇలాంటి భూములకు ఆర్డీవో కార్యాలయం నుంచి పుట్టగొడుగుల్లా ఓఆర్‌సీలు పుట్టుకొస్తున్నాయి.

ఊరి పెద్దలే రాబందులు

ఆలయాల భూముల పాలిట ఊరి పెద్దలే రాబందులుగా మారారు. ఉన్నవి సరిపోవని దేవుడి ఆస్తులపై పడ్డారు. అనుభవదారులను నయానోభయానో మచ్చిక చేసుకొని, రికార్డుల్లో ఉన్న సర్వే నెంబర్లకు బైలు సృష్టించి, తమ పేర్లపై బదలాయించుకున్నారు. యక్తపూరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన భార్య పేర ఇలాగే బైలు సృష్టించి, అనుభవదారుడి వద్ద కొనుగోలు చేశాడు. దీనినే మరొక ఊరిపెద్ద కారుచౌకగా కొనుగోలు చేసి, ప్రస్తుతం ఓఆర్‌సీ పొంది అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది.

- బోరవెల్లి గ్రామ శివారులోని సర్వే నెంబరు 294లో రెండెకరాలు, 295లో మూడెకరాలకు మొత్తం ఐదు ఎకరాలకు 8-8-2024న ఆర్డీవో కార్యాలయం నుంచి చట్టంలో ఉన్న లొసుగులను ఆధారంగా చేసుకుని ఓఆర్‌సీ జారీ చేశారు. ఈ ఐదు ఎకరాలను కొనుగోలు చేసిన ఓ గ్రామ పెద్ద వోఆర్‌సీని పట్టుకుని రిజిస్ట్రేషన్ కోసం స్థానిక రెవెన్యూ అధికారిపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. అనుభవదారులేమో ఇలా దేవుడి భుములను తెగనమ్ముతుంటే, అక్కడి అర్చకులేమో అర్ధాకలితో తరతరాలుగా నిత్యం కైంకర్యాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆలయాలకు భూములు ఉండటంతో దూపదీప నైవేద్య పథకానికి నోచుకోలేకపోయమని ఆలయ అర్చకుడు రవీంద్రనాథ్ ఆచార్యులు ఆవేదనతో తెలిపారు. ఎండోమెంట్ అధికారుల ఉదాసీనత వల్ల బోరవెల్లి కేశవస్వామి ఆలయ భూములు వేరే వ్యక్తుల చేతుల్లోకి వెళ్లాయి. అనుభవదారుల నుంచి వీరు కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లుగా తెలుస్తోంది. సర్వే నెంబరు 270లో కేశవస్వామి ఆలయానికి 10 ఎకరాలా ఐదు గుంటల భూమి ఉండగా 270/ఏ, 270/బీ సృష్టించి రెండెకరాల భూమిని అనుభవదారులైన కిల్లెదారి రాధాకృష్ణ, కిల్లెదారి క్రిష్ణయ్య అదే గ్రామానికి చెందిన మొహ్మద్‌హుస్సేన్ భార్య రిజ్వానబీ పేరిట 19-07-2017న గద్వాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేశారు. ధరణి పోర్టల్‌లో మాత్రం దేవుడి పేరే కనిపిస్తున్నా.. సదరు దేవుడి భూమి మాత్రం మతేతర వ్యక్తుల చేతుల్లో ఉండటం చర్చనీయంశంగా మారింది. ఇదే సర్వే నంబర్‌లోని మరో రెండెకరాల భూమిని అదే రోజున అదే గ్రామానికి చెందిన మరొక వ్యక్తి తన భార్య షామీమ్‌బీ పేరిట రిజిస్టర్ చేసుకుని సాగు చేస్తున్నట్లు తెలిసింది.

లేఖ రాసి, ఆర్‌వో ఇచ్చి ఉంటాం

ఖిద్మతి ఇనాం భూములకు వోఆర్‌సీలు ఇవ్వరు. ఒకవేళ ఆ భూములకు ఓఆర్‌సీలు కావాలని ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే దాని ప్రతితో ఎండోమెంట్ వారికి లేఖ రాస్తాం. వారు అనుమతి ఇస్తేనే ఓఆర్సీలు జారీ చేస్తాం. బోరవెల్లిలోని చెన్నకేశవ స్వామి భూముల విషయంలో కూడా ఇలాగే లేఖలు రాసి, ఓఆర్‌సీలు ఇచ్చి ఉంటాం.

- ఆర్డీవో రామ్‌చందర్

ఆర్డీవో కార్యాలయం నుంచి లేఖ రాలేదు

సదరు భూములపై ఆర్డీవో కార్యాలయం నుంచి మాకు ఎలాంటి లేఖ రాలేదు. ఖిద్మతి ఇనాం భూములకు ఎన్‌వోసీ మేం ఎలా ఇస్తాం. ఇదంతా రెవెన్యూ అధికారులు చేస్తున్న తతంగం. రెవెన్యూ అధికారులు వోఆర్‌సీలు ఇష్టారీతిన జారీ చేయడం, మేము ఇదేంటని అడిగితే కోర్టుకు వెళ్లాలని సూచించడం వారికి పరిపాటిగా మారింది.

- వెంకటేశ్వరి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్

సంఘటితంతోనే దేశ రక్షణ

- పేటలో ఆర్‌ఎస్‌ఎస్ భారీ కవాతు
- హారతులతో స్వాగతం పలికిన మహిళలు
- దారి పొడవునా పూలవర్షం కురిపించిన ప్రజలు



కవాతు నిర్వహిస్తున్న స్వయం సేవకులపై పుష్ప వర్షం కురిపిస్తున్న మహిళలు

నారాయణపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : హిందువుల సంఘటితంతోనే బారత దేశానికి రక్షణ అని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్ జీ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం శత వసంతాల వేడుకలను సోమవారం నారాయణపేట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వందలాది మంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పళ్ల హనుమాన్ మందిరం నుంచి పూర్తి గణవేషతో కవాతు ప్రారంభించారు. శివాజీ నగర్, సరాఫ్ బజార్, సెంటర్ చౌక్, మెయిన్ రోడ్, వీరసావర్కర్ చౌరస్తా, సత్యానారాయణ చౌరస్తా మీదుగా కవాతు శ్రీపంక్షన్ హాల్‌కు చేరుకున్నది. దారి పొడవునా మహిళలు వారికి హారతులు పట్టి, పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీఫంక్షన్ హాల్‌లో డాక్టర్ మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన సభలో ప్రాంత ప్రచారక్ లింగం శ్రీదర్‌జీ ప్రసంగించారు. దేశ రక్షణ ప్రజల చేతిలోనే ఉందన్నారు. ఇరుగు పొరుగు దేశాల్లో హిందువులకు రక్షణ లేక అల్లాడుతున్నారని తెలిపారు. ఇటీవల బంగ్లాదేశ్‌లో ఆలయాలపై, హిందువులపై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనమన్నారు. భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుండటం కొన్ని దేశాలకు, కొన్ని శక్తులకు కంటగింపుగా మారిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ, నందు నామాజీ, డాక్టర్లు మదన్‌మోహన్ రెడ్డి, రాంబాబు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.

విశ్వగురు స్థానంలో నిలపడమే లక్ష్యం

ఊట్కూర్ : దేశాన్ని విశ్వగురు స్థానం నిలపడమే లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తోందని పాలమూర్ విభాగ్ ప్రచారక్ దేవేందర్‌జీ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శత వసంతాల సంబురాలను సోమవారం ఊట్కూర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ యువతలో జాతీయత, నైతిక విలువలను పెంపొందిస్తున్నట్లు తెలిపారు. స్వామి అదిత్య పరాశ్రీ మాట్లాడుతూ నైతిక విలువల పెంపునకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో నీలి రాంరెడ్డి, మ్యాడం లక్షణ్, మాజీ సర్పంచ్ భాస్కర్, హనుమంతు, వెంకటయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ఖిల్లాఘణపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ నందకిషోర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన పుల్లారి రాజు, వెంకటేష్ అనే వ్యక్తులు మహబూబ్‌నగర్ వీరన్న పేట ప్రాంతానికి చెందిన రేషన్ డీలర్ చంద్రశేఖర్‌కు సంబంధించిన 15 క్వింటాళ్ల (30 బస్తాలు)తో పాటు, వినియోగదారుల నుంచి సేకరించిన నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యా న్ని సేకరించారు. ఆ బియ్యాన్ని సోమవారం తెల్లవారుజామున మారుతీ వ్యాన్‌లో ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని దివ్య నవ్య రైస్ మిల్‌కు తరలిస్తుండగా, వనపర్తి సీసీఎస్ (సెంట్రల్ క్రైమ్ స్టేషన్) పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న వారితో పాటు, రైస్‌మిల్లు యజమాని పాలవాది లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

లక్కీడ్రా పేరుతో భారీ మోసం

- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు

చిన్నంబావి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : లక్కీ డ్రా పేరుతో లక్షల రూపాయలు వసూలు చేసిన నిర్వాహకులు చివరకు చేతులెత్తేసి పరారయ్యారు. సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా చిన్నంబావి మండల కేంద్రంలో తిరుమలై ఎంటర్‌ప్రైజెస్ పేరుతో చిన్నంబావి మండల కేంద్రంలో 2022లో కొందరు లక్కీడ్రా స్కీమ్ ఏర్పాటు చేశారు. అందులో ఐదుగురు సభ్యులున్నారు. మరో 16 మందిని ఏజెంట్లుగా చేర్చారు. విస్తృతంగా ప్రచారం చేసి వేలాది మందితో స్కీం కట్టించారు. ప్రతీనెల 2,800 నుంచి మూడువేల మంది పేర్లతో లక్కీడ్రా తీసి, 10 మందికి బహుమతులను అందించేవారు. స్కీం కాలపరిమితి అయిపోయిన తర్వాత బహుమతులు రాని వారికి కూడా వారు చెల్లించిన మొత్తానికి సరిపోయే గిఫ్ట్ అందిస్తామని నిర్వాహకులు చెప్పారు. ఈ క్రమంలో 2024, జనవరి నాటికి లక్కీడ్రా స్కీమ్ కాలపరిమితి ముగిసింది. కానీ బహుమతులు రాకుండా మిగిలిన పోయిన వారికి ఎలాంటి డబ్బులు ఇవ్వకుండా చేతులెత్తేశారు. స్కీం భాగస్తులు ఒక్కొక్కరుగా జారుకోగా ఒక్కరు మాత్రమే మిగిలిపోయాడు. దీంతో అతడిపై ఒత్తిడి పెరగడంతో ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన గ్రామ పెద్దలు అతడితో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో 35 మందిని స్కీమ్‌లో సభ్యులుగా చేర్పించిన ఒక ఏజెంట్ రూ. 5.60 లక్షలు చెల్లించి మోసపోయానంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు చిన్నంబావి ఎస్‌ఐ పబ్బతి రమేశ్ తెలిపారు.



స్కీంకు సంబంధించిన కరపత్రం

పకడ్బందీగా పథకాల అమలు

(మొదటి పేజీ తరువాయి)

కింద నెలకు రూ.300 చెల్లిస్తే 60 సంవత్సరాల తరువాత నెలకు రూ.5 వేలు పెన్షన్ వస్తుందని తెలిపారు. ఇంత ముఖ్యమైన బీమా పథకాలను ప్రజలకు చేరవేయడంలో బ్యాంకులు పూర్తిగా నిర్లక్ష్యం వహించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో బ్యాంకు ఒక్కరూ, ఇద్దరు రెండంకెల సంఖ్యలో బీమా చేయించారని వాటి రెన్యువల్ వచ్చే సరికి జీరో అయిందని అన్నారు. ఇంత నిర్లక్ష్యం ఏమిటని బ్యాంకర్లను ప్రశ్నించారు. ముద్ర రుణాలు, టర్మ్ లోన్, ప్రయారిటీ సెక్టార్, నాన్ ప్రయారిటీ సెక్టార్ వారీగా ఇవ్వాల్సిన రుణాలు సైతం నిర్దేశించిన లక్ష్యాలు సాధించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట రుణాలు సైతం బ్యాంకర్లు లక్ష్యం మేరకు రైతులకు ఇవ్వడం లేదని అసహనం వ్యక్తం చేశారు. వచ్చే దిశ సమావేశం నాటికి ప్రజలకు అవగాహన కల్పించి లక్ష్యాలు సాధించాలని ఆదేశించారు. ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా యువతకు, మహిళలకు స్వయం ఉపాధికి 80 శాతం సబ్సిడీతో 2021-22 లో మంజూరైన రుణాలు ఇప్పటి వరకు గ్రౌండింగ్ కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 80 శాతం డబ్బులు ప్రభుత్వం ద్వారా మంజూరై బ్యాంకుల్లో డబ్బులు మూలుగుతున్నా బ్యాంకులు ఇవ్వాల్సిన 20 శాతం ఇవ్వకుండా తాత్సారం చేయడం ఏంటని ప్రశ్నించారు. వారం రోజుల్లో సబ్సిడీ రుణాలు గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. కొంతమంది బ్యాంకు మేనేజర్లు సమావేశానికి గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరుపై కలెక్టర్‌కు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలను అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా అమలు చేస్తే ప్రజలకు ఫలాలు అందుతాయని సూచించారు. వనపర్తి జిల్లాలోని ప్రస్తుతం ఉన్న అన్ని గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరం మేరకు ఎంపీ నిధులు మంజూరు చేసి మరుగుదొడ్ల నిర్మాణాలు, మరమ్మతులు పూర్తి చేయిస్తామని సూచించారు.



సమావేశానికి హాజరైన అధికారులు

అనంతరం విద్య, వైద్యం, గ్రామీణ అభివృద్ధి శాఖ, మిషన్ భగీ రథ, పౌరసరఫరాల శాఖ పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహించారు. అన్ని గురుకుల పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల ఖాళీ లను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని దిశ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. వనపర్తి జిల్లా నుంచి మిల్లర్లు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండి యాకు ఇవ్వాల్సిన బియ్యంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బియ్యం ఇవ్వని మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేయాలని సూచిం చారు. విద్యుత్ శాఖపై సమీక్ష నిర్వహిస్తు జిల్లాలో ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలు తొలగింపు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సబ్ స్టేషన్‌లో అవసరంపై పూర్తి నివేదికను ఇవ్వాలని విద్యుత్ శాఖ ఎస్ఈని ఆదేశించారు. బీఎస్ఎన్ఎల్ శాఖ సమీక్ష సందర్భంగా జిల్లాలో సెల్‌ఫోన్ సిగ్నల్‌కు సమస్య రాకుండా కొత్త సెల్ టవర్లకు ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. అక్టోబరు 22న నాగర్ కర్నూల్ జిల్లాలో నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ ఒక రోజు వర్క్‌షాప్ ఉంటుందని, వనపర్తి జిల్లా సంబంధిత అధికారులు సైతం పాల్గొని వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... సంక్షేమ శాఖల ద్వారా సబ్సిడీ రుణాల గ్రౌండింగ్‌పై నివేదిక ఇవ్వాలని, అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో స్థానిక శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి, దేవరకద్ర శాసన సభ్యుడు జి.మధుసూదన్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ బోర్డు చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ , అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, దిశ కమిటీ సభ్యులు వీరయ్య, గంధం ఆంజనేయులు, చిన్నమ్మ థామస్, వెంకటేష్, శంకర్ నాయక్, ధనలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఉమాదేవి, జిల్లా అధికారులు, లీడ్ బ్యాంకు మేనేజర్ కౌశల్ కిషోర్ పాండే, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలు భరించలేక వ్యక్తి ఆత్మహత్య

చిన్నంబావి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలు భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామానికి చెందిన అల్లూరి చంద్రారెడ్డి (55)కి ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తెకు వివాహ మైంది, ఆమె హైదరాబాద్‌లో ఉంటున్నారు. చిన్న కుమార్తెలో అమెరికాలో ఉంటోం ది. ఆయన భార్య గతంలోనే మృతి చెందింది. దీంతో గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న ఆయన సోమవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మనస్తాపంతో మహిళ..

కోస్గి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : చిన్న గొడవతో మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. నారాయణపేట జిల్లా గుండుమల్ మండలం భక్తిమల గ్రామంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన వెంకటమ్మ (45) కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటూ పని చేసుకొని జీవిస్తోంది. ఇటీవల పండుగకు స్వగ్రా మానికి వచ్చింది. కాగా కుటుంబంలో చిన్న గొడవతో మనస్తాపం చెందిన ఆమె ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ విషయంపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

బిజినేపల్లి, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కేఎల్‌ఐ కాలువలో పడి గల్లంతైన ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్ గ్రామానికి చెందిన ఈర్ల రాములు(35) సోమవారం బైక్‌పై గౌరారం గ్రామానికి వెళ్తూ, మంగనూర్ సమీపంలోని కేఎల్‌ఐ కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. గమనించిన స్థానికులు గాలించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి సోమవారం ఉదయం రెస్క్యూ టీంను రప్పించి కాలువలో గాలించగా మృతదేహం లభ్యమైంది. అతడి భార్య ఈర్ల లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యమయ్యింది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన సరిత భర్త కృష్ణ ఇటీవల పక్షవాతానికి గురయ్యాడు. అతడికి తోడుగా ఉండాల్సిన సరిత తల్లిగారింటికి వచ్చింది. దీంతో తండ్రి బంగారయ్య ఆమెను మందలించాడు. దీంతో ఆమె ఈ నెల 10న ఇద్దరు పిల్లలు వైష్ణవి(7), భువనేశ్వర్ (5)లను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు రిపోర్టు ఇవ్వాలి

» జిల్లా అధికారులను ఆదేశించిన కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలుచేస్తున్న ఆయా ప్రభుత్వ శాఖలు రిపోర్ట్‌ను సమర్పించాలని కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత శాఖల అధికాలను ఆదేశించారు. ఈ (పథకాలు) స్కీమ్స్ అమలుపై త్వరలో దిశ సమావేశం జరుగనున్నదని, ఇందుకు సంబంధించి నివేదికలు సమర్పించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు, సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ప్రజాఫిర్యాదులు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన లెటర్ల పరిష్కారం, వాటికి ఇచ్చిన జవాబు పత్రాలపై, సెంట్రల్ స్కీమ్స్ అమలు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంట్రల్, స్టేట్ స్కీమ్స్ అమలుపై ఈనెల 3 లేదా 4వ వారంలో దిశ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులంతా హాజరవుతారని, సమావేశానికి సంబంధించిన నివేదికలు సమర్పించాలని చెప్పారు. ఈ విషయంపై ఈనెల 19, 21వ తేదీల్లో సంబంధిత 41శాఖల అధికారులతో సమావేశం ఉంటుందన్నారు. ఆయా శాఖల అధికారులు ఈనెల 18లోపు నివేదికలను సమర్పించాలని ఆమె ఆదేశించారు. అనంతరం డబుల్ బెడ్ రూమ్‌ల ఇళ్ల మంజూరును ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11న జీవో నెంబర్ 33ను విడుదల చేసిందని, ఆయా మండలాల్లో ఇందుకు సంబంధించి కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ విషయంపై మండల ప్రత్యేకాధికారులు ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. అదేవిధంగా మండలానికి ఒకటి చొప్పున వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ఈకార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులను భాగస్వాములను చేయాలని సూచించారు. ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేసి, ఎంబీ రికార్డులను, యూసీలను సమర్పించాలని ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాలు తదితర శాఖలకు మంజూరైన భవన నిర్మాణాలకు స్థలం కావాలనుకున్న శాఖలు తక్షణమే ప్రతిపాదనలు పంపించాల న్నారు. పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు వ్యవసాయంపై ఆసక్తిని పెంపొందించుటకు కలెక్టర్ ఆదేశాలతో ఆకుకూరలు, తీగ కూరగాయలు, కూరగాయలను అయా పాఠశాలలో పండించేందుకు విత్తనాలను అందించనున్నట్లు హార్టికల్చర్ ఏడీ సాయిబాబా తెలిపా రు. జిల్లా విద్యాశాఖ అధికారి ఇచ్చిన జాబితా ప్రకారం జిల్లాలో మొ త్తం 1412 పాఠశాలలు ఉన్నాయని, జాబితా ప్రకారం కూరగాయలు, తీగ కూరగాయలు, ఆకుకూరల విత్తనాలను కలెక్టర్ ఆదేశాల మేరకు అందించనున్నట్లు తెలిపారు. మొదట కలెక్టర్‌కు విత్తనాల ప్యాకె ట్‌ను అందజేశారు. అనంతరం కలెక్టర్ ఆయాశాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాఖల అధికారులకు విత్తన ప్యాకెట్లను అందజేశారు.



కలెక్టర్‌కు ఆకుకూరలు, కూరగాయల విత్తన ప్యాకెట్ అందజేస్తున్న హార్టికల్చర్ ఏడీ సాయిబాబా

ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. దేవరకద్ర మండలం గోపన్‌పల్లిలో సర్వే నెంబర్ 275లో గల 3 ఎకరాల అసైన్‌మెంట్ భూమిలో సెరిసగం 1.20 ఎకరాల చొప్పున గత 30ఏళ్ల నుంచి సాగుచేసుకుని జీవిస్తున్నాము. మాపేర్లను ఆన్‌లైన్‌లో ఎక్కిస్తూ మాకు కొత్త పాసుబుక్కులు ఇవ్వాలని ఐదేళ్ల నుంచి దరఖా స్తులు ఇస్తూ అధికారుల చుట్టూ తిరుగుతున్నం. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. మండల స్థాయిలో అధికారులు మోకాపైకి వచ్చి విచారణ చేసి, విచారణ రిపోర్టు ఇచ్చారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించడం లేదని మహిళా రైతులు బోయ బాలకిష్టమ్మ, మాల యశోద ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● నవాబ్‌పేట మండలం కొల్లూరు గ్రామ శివా రులో సర్వే నెంబర్ 305లో 2.30 ఎకరాల సాగు భూమి ఉంది. ఈ భూమిపై 2017లో 93 వేలు క్రాప్‌లోన్ తీసుకున్నా, అప్పటి ప్రభుత్వం ముఖ్య మంత్రి కేసీఆర్ హయాంలో ఆ లోన్ మాఫీ అయ్యింది, మిత్తి కింద బ్యాంకు వారు రెండు పర్యాయాలుగా ఒకసారి 54 వేలు, మరోసారి 27,700 కట్టించుకున్నారు. తిరిగి క్రాప్‌లోన్ తీసుకుందామంటే బ్యాంకువారు ఇవ్వడంలేదని ఆ సాగు భూమి రైతు సత్యనారాయణ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. క్రాప్ లోన్ మంజూరుకు అప్పు కట్టినప్పటి నుంచి తిప్పించుకుంటున్నారు గాని లోన్ ఇవ్వడంలేదని వాపోయారు.



రైతు సత్యనారాయణ

● ఆరెకటికల కులగురువు ధర్మవ్యాదు డు నిలువెత్తు 6 అడుగుల కాంస్య విగ్రహం పెట్టేందుకు మహబూబ్‌నగర్ పట్టణ కూడలీలో స్థలం ఇప్పించాలని ఆరెకటిక అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి. భూంపల్లి అశోక్ కుమార్‌తో పాటు ఐదుగురు సభ్యులు ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.

ప్రజావాణికి స్పందన కరువు



నవాబుపేటలో ఫిర్యాదుదారుల కోసం వేచి చూస్తున్న అధికారులు

నవాబ్‌పేట/ బాలానగర్/ హన్వాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. దీంతో అధికారుల ఆర్భాటం తప్ప కొత్తగా ఏమీలేదని మండల ప్రజలు అంటున్నారు. జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ప్రజలు భారీగా వస్తుండటంతో కలెక్టర్ ఇతర ఉన్నతస్థాయి అధికారుల నిర్ణయం మేరకు మూడు వారాలుగా మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కానీ పట్టుమని పది ఫిర్యాదులు కూడా రావడంలేదు. మూడు వారాలుగా మూడు, నాలుగుకు మించి రావడం లేదని అధికారులు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం గురించి గ్రామాల్లో చాటింపు వేయిస్తే బావుంటుందని మండల ప్రజలు పలువురు పేర్కొంటున్నారు.

నవాబుపేటలో ఫిర్యాదుదారుల కోసం అధికారుల ఎదురుచూపులు

బాలానగర్‌లో మొక్కుబడిగా..

బాలానగర్ (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశంలో సోమవారం ప్రజావాణి కార్యక్ర మం నిర్వహించారు. ఉదయం 10:30కు ప్రారం భమై, మధ్యాహ్నం రెండు గంటల వరకు కొన సాగింది. ఫిర్యాదుదారులు తక్కువ సంఖ్యలో వచ్చారు. అయితే ఈ కార్యక్రమానికి వైద్యశాఖ, పోలీస్ శాఖ, పశువైద్యశాఖ, విద్యాశాఖ, ఆధికా రులు హాజరుకాలేదు. విద్యుత్ శాఖ అధికారి ప్రజావాణి ప్రారంభమైన గంట తర్వాత వచ్చారు. ఈ సమావేశంలో ప్రజా సమస్యల కంటే ఉపాధి హామీ పథకం , పారిశుధ్య కార్యక్రమాల గురించి కార్యదర్శులు, ఎంపీడీవో చర్చించారు.

హన్వాడలో ఫిర్యాదులు నిల్

హన్వాడ (ఆంధ్రజ్యోతి): మండల ప్రజ పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు ఒక్కటికి కూడా రాలేదని అధికారులు తెలిపారు. మూడు వారాల నుంచి ఇదే పరిస్థితి ఉందని చెప్పారు. తహసీల్దార్ కిష్టానాయక్, ఎంపీడీవో యశోదమ్మ, అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులపై సమ్మె కేసులు

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని 2017 నుంచి పెరగాల్సిన జీత భత్యాలను పెంచాలని, ఖాళీలను భర్తీ చేయాలని డ్రైవర్, కండక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలనే తదితర 26 డిమాండ్ల సాధనకై 2019 అక్టోబరు 5 నుండి నవంబర్ 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 52 రోజుల సమ్మెలో పాల్గొన్న మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిపో కార్మికులపై పోలీసులు ఎఫ్ఐఆర్ నెంబర్ 222. 2019 ప్రకారం కేసు నమోదు చేశారు. చట్ట విరుద్ధంగా గుమికూడి సమ్మె చేయడాన్ని నేరంగా పరిగణిస్తూ ఐపీసీ అండర్ సెక్షన్ 143, 147, 341, 342, 324, 504, 506, 149 లతో 15 మందిపై కేసులు బుక్ అయ్యాయి. ఈ 15 మంది ఆర్టీసీ ఉద్యోగులు డిసెంబరు 11న మహబూబ్‌నగర్ జ్యుడిషియల్ ఫస్టు క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుకావాల్సి ఉంటుందని, త్వరలో కోర్టు సమసన్లు జారీ చేయనున్నట్లు తెలిసింది.

ఐక్యపోరాటంతోనే సమగ్ర కులగణన జీవో

పాలమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీ సమాజ్, బీసీ కులసంఘాల పోరాట ఫలితంగానే తెలంగాణ సమగ్ర కులగణన జీవో విడుదల చేశారని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి కులగణన తరువాతనే 42శాతం రిజర్వేషన్ అమలు చేశాకే ఎన్నికలకు వెళ్తామని ప్రకటించిన విషయాన్నిగుర్తుచేశారు. బీసీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ చిరంజీవులు, కాంగ్రెస్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో బీసీ కులగణన చేపట్టాలన్నారు. సమావేశంలో లక్ష్మీకాంత్, జాంధ్ర మహేందర్, ఆశన్న, వేణు, మద్దూరికృష్ణ, సుకుమార్, సవారి సత్యం, బి.శేఖర్, తిరుపతయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

హన్వాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయినోనిపల్లి గ్రామంలో సోమవారం వరి కొనుగోలు కేంద్రాన్ని గ్రామ కార్యదర్శి రజిత, మహిళ సమైక్య అధ్యక్షులు లక్ష్మీ, రాజామణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెద్దచెన్నయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నర్సిములు, నాయకులు తిరుపతయ్య, మోహన్, సత్యయ్య పి. మోహన్, కృష్ణయ్య, తిరుపతయ్య, గంగాపూరి తదితరులు పాల్గొన్నారు.

18న అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

జడ్చర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి ఈనెల 17లోగా దరఖాస్తు చేసుకోవాలని, 18న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సుకన్య సోమవారం ప్రకటనలో తెలిపారు. కమిషనరేట్ ఆఫ్ కాలేజి ఎడ్యుకేషన్ ఆదేశానుసారం కామర్స్ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఈటీ, ఎన్ఈటీ, పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 17లోగా కళాశాలలోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో 18న ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

20న టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనసభ

పాలమూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం చేస్తున్నట్లు ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేష్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో వెంకట్రాములు, నరసింహా, దాసు, బాలు, గణేష్, ఆర్ఆర్ మణ్యం పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం: కేసు నమోదు

జడ్చర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల మండలం కుర్వగడ్డపల్లికి చెందిన మనెమోని రాంచరణ్ కనిపించడంలేదంటూ తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఈ నెల 13న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, వెదికినా ఫలితం లేకపోవడంతో సోమవారం కృష్ణయ్య ఫిర్యాదు చేశాడని, ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

సోమ్లు మరణానికి రుణమాఫీ కారణం కాదు

» జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వివరణ

నవాబ్‌పేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నవాబ్‌పేట మండలం ఊరంచుతండాకు చెందిన కెతావత్ సోమ్లు మరణానికి రుణమాఫీ కారణం కాదని జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్ సోమవారం వివరణ ఇచ్చారు. ఈనెల 5న కెతావత్ సోమ్లు రుణమాఫీ కాకపోవడంతో గుండెపోటుతో మరణించారని ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురించగా జిల్లా వ్యవసాయ అధికారి విచారణకు ఆదేశించారు. సోమ్లు గతంలో నుంచే అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఆయనకు 75సంవత్సరాల వయస్సు పైబడి ఉండటంతో ఆయనకు అనారోగ్య సమస్యలు ఉన్నాయన్నారు. నవాబ్‌పేట ఎస్‌బీఐ ఖాతాలో లంబడి సోమ్లు అని, అతని ఆధార్ కార్డులో కెతావత్ సోమ్లా అని ఉండటం వల్ల రుణమాఫీ కాలేదన్నారు. మాఫీకి అతని మరణానికి ఎలాంటి సంబంధం లేదన్నారు.

దేశభక్తి, త్యాగనిరతిని పెంపొందించేందుకు కృషి

భూత్పూర్‌లో ఆర్ఎస్ఎస్ పథసంచలన్



భూత్పూర్‌లో పథసంచలన్ చేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

భూత్పూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో దేశభక్తిని, త్యాగనిరతిని, సమర్పణ భావాన్ని పెంపొందిస్తూ ఈ భారతావనిని విశ్వగురువుగా నిలిపేందుకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని సరస్వతీ విద్యాపీఠం పాలమూరు జిల్లా అధ్యక్షుడు మోదేపల్లి కొండయ్య అన్నారు. సోమవారం మునిసిపాలిటీ కేంద్రంలోని కేఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ పథసంచలన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మోదేపల్లి కొండయ్య, ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ ధర్మజాగరణ ప్రముఖ్ లక్ష్మీకాంత్, స్థానిక మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, తదితరులు పాల్గొని మాట్లాడారు. విజయ దశమి శత వసంతాలోకి వచ్చిందని ఈ సందర్భంగా పథసంచలన్ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అంతకుముందు అక్కడే శమీపూజ కార్యక్రమంలో పాల్గొని భరత మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనతరం దసరా పండుగ ప్రాముఖ్యతను వక్తలు లక్ష్మీకాంత్ వివరించారు. భూత్పూర్ చౌరస్తాలో పథసంచలన్ ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, ఆర్ఎస్ఎస్ యువకుడు శ్యాంసుందర్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌గౌడ్, యువకులు, తదితరులు పాల్గొన్నారు

హిందూధర్మ రక్షణకు కంకణబద్ధులు కావాలి

» నవాబ్‌పేటలో భారీ ర్యాలీ

నవాబ్‌పేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశంలో విదేశీ వస్తువులను బహిష్కరించి స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సేవా ప్రముఖ్‌శ్రీ శివశంకర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నవాబ్‌పేట మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం పబ్బరాజు శరత్‌కృష్ణ అధ్యక్షతన పథసంచలన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉత్సవ సమయంలో స్వయం సేవకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ హిందూ ధర్మ రక్షణకు ప్రతీ ఒక్కరు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి హిందువు తమ మత సంరక్షణకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రేమ్‌సుధాకర్, గాండ్ల చంద్రశేఖర్, కొల్లూర్ చందు, బచ్చు రామక్రిష్ణ,శివ, మల్లేష్, కుర్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివశంకర్

జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిగా శంకరాచారి

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా మైనార్టీ సంక్షేమాశాఖ అధికారిగా శంకరాచారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. జాయింట్ రిజిస్టర్, జిల్లా కోఆపరేటివ్ అధికారిగా పనిచేస్తున్న ఈయనకు మైనార్టీ సంక్షేమాశాఖ అధికారిగా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించారు. గతంలో రవీంద్రనాథ్ బదిలీపై వెళ్లగా, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర ఇన్‌చార్జీగా వ్యవహరించారు.

29 తులాల బంగారు నగలు చోరీ

» బాధితుల్లో ఒకరు హోంగార్డు, మరొకరు ఎక్స్ ఆర్మీజవాన్

మహబూబ్‌నగర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యానికి చెల్లించక తప్పదు భారీ మూల్యం అని చెప్పడానికి మహబూబ్‌నగర్‌లో జరిగిన మూడు చోరీలు అద్దం పడుతున్నాయి. ఈ మూడు దొంగతనాల్లో బాధితులు 29తులాల బంగారు నగలను పోగొట్టుకున్నారు. బస్సుల్లో ప్రయాణిస్తూ బ్యాగ్‌లలో నుంచి బంగారునగలు పోగొట్టుకున్న వైనం ప్రయాణికులను, పోలీసులను ఉలిక్కిపడేలా చేస్తోంది. బాధితులు సోమవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుల్లో ఒకరు హోంగార్డుగా సీఎం ఇంటివద్ద పనిచేస్తుండగా, మరొకరు ఎక్స్ ఆర్మీజవాన్ కావడం గమనార్హం. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

● హైదరాబాద్ చింతలబస్తీకి చెందిన కోస్గి సువర్ణ హోంగార్డుగా సీఎం నివాసం వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. దసరా పండగకు తన తల్లిగారి ఊరైన గండీడ్ మండలం కొండారెడ్డిపల్లికి ఈనెల 12న వచ్చి సోమవారం హైదరాబాద్‌కు తిరుగుప్రయాణం అయ్యారు. మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో దిగి తన ఇద్దరు పిల్లలతో కలిసి మధ్యాహ్నం 3:30 గంటలకు హైదరాబాద్ బస్సు ఎక్కారు చేతిలో బ్యాగ్ చూస్తే జిప్ ఓపెన్ చేసి ఉండటంతో బ్యాగ్‌లో వెతకగా అందులో బంగారు నగలు కనిపించలేదు. 4.5 తులాల బంగారు నాణు, 2 తులాల వంకి ఉంగరం, ముక్కుపుడక కనిపించకపోవడంతో బాదితురాలు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు.

● హైదరాబాద్‌లో ఉంటున్న ఎక్స్ ఆర్మీ జవాన్ ఏ నరేశ్ ఈనెల 9న పండగకు సొంతూరు హస్నాబాద్ బయలుదేరారు. హైదరాబాద్ నుంచి రైలులో మహబూబ్‌నగర్‌కు వచ్చి బస్టాండ్‌లో పరిగి బస్సు ఎక్కి హస్నాబాద్ వెళ్లాడు. 11న గుడికి వెళ్లేముందు బ్యాగ్ చూడగా అందులో 14 తులాల బంగారు నగలు కనిపించలేదు. దీంతో సోమవారం బాదితుడు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.

● మరికల్ మండలం చిత్తనూరుకు చెందిన సలుగుట్టి సుధారాణి సోమవారం తన ఊరు వెళ్లేందుకు సాయంత్రం 5:40 గంటలకు మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో రాయిచూర్ బస్సు ఎక్కింది. హ్యాండ్‌బ్యాగ్‌లో ఆధార్‌కార్డు తీసుకుందామని చూడగా అందులో బంగారు నగలున్న పర్సు కనిపించలేదు. చుట్టూ వెతికినా ఎక్కడా కనిపించకపోవడంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాగ్‌లో 8 తులాల బంగారు నగలు చోరీకి గురయ్యాయి.

ఇలా ఒకేరోజు మూడు దొంగతనాలు అందులో బస్టాండ్ బస్సులో ప్రయాణించేవారి బ్యాగ్‌లనుంచే దొంగతనాలు జరగడంతో ప్రయాణికులు, పోలీసులు ఉలిక్కిపడుతున్నారు. దొంగలు బస్టాండ్‌లో బస్సు ఎక్కే వారినే టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. బస్టాండ్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగలకు దొంగతనాలకు మార్గం సుగమమవుతోంది. పోలీసులు ఆర్టీసీ అధికారులకు సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎన్నిసార్లు కోరినా ఫలితం లేకపోయింది.

18న అండర్-23 జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో నవంబర్‌లో 2నుంచి వరంగల్, సంగారెడ్డి పట్టణాల్లో నిర్వహిం చే అండర్-23 రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్ల ఎంపికలు ఈ నెల 18న బోయపల్లి సమీపంలో గల ఎండీసీఏ మైదానంలో చేపట్టనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు క్రీడాకారులు జనన ధ్రువీకరణ, ఆధార్, తెల్లటి క్రీడాదుస్తులతో హాజరుకావాలని సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 6 జట్లు ఎంపిక చేసి, ఆయా జట్లకు మ్యాచ్‌లు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో తుది జట్టును ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

17న ఎస్‌జీఎఫ్ వాలీబాల్ జిల్లా జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 17 అండర్-17, 18న అండర్-14 జిల్లా బాల,బాలికల వాలీబాల్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14 విభాగంలో 01-01-2008, అండర్-17 విభాగంలో 1-1-2011 తర్వాత జన్మించిన వారు ఎంపికకు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 9గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర) ఎంపికలు ఉంటాయని, బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో రావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 9440705495 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి బీమా పథకాలపై జనసురక్ష ప్రచారం

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి) : సామాజిక భద్రతా పథకాలైన ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకాలను వినియోగించుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి కోరారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 18 నుంచి 70 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు ప్రధాన మంత్రి బీమా యోజన సంవత్సరానికి 20 రూపాయల ప్రీమియంతో ప్రమాద బీమాను కవర్ చేయడానికి ఉద్దేశించిందని, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన రూపాయలు 436 వార్షిక ప్రీమియంతో అన్నిరకాల మరణాలను కవర్ చేస్తుందని, 18 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారు పొందవచ్చొన్నారు. ఈ రెండూ బీమా పథకాల వార్షిక ప్రీమియంలను బ్యాంకులు, లేదా పోస్టాఫీసుల ద్వార పొందవచ్చని తెలిపారు. ఈ విషయంపై ఈ నెల 15 నుండి 15-01-2025 వరకు (3 నెలలు) జనసురక్ష ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈప్రచారం సందర్భంగా ప్రతి గ్రామ పంచాయతీలో ప్రత్యేక ఆర్థిక అక్షరాస్యత శిబిరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

పదో తరగతి పరీక్షల సమయం పెంచాలి

» విద్యాశాఖ కమిషనర్ నర్సింహారెడ్డికి టీపీఆర్టీయూ వినతి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు నిర్వహించే వార్షిక పరీక్షలకు సంబంధించి భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలకు 20 నిమిషాల సమయాన్ని పెంచాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్ నర్సింహారెడ్డిని తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి , మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భూపతిసింగ్ తదితరులు కలిసి వినతి పత్రం అందజేశారు దీనిపై అయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

జడ్చర్లలో దసరా అలయ్ బలయ్



జడ్చర్లలో అలయ్ బలయ్ కార్యక్రమంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న స్థానికులు

జడ్చర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జడ్చర్లలోని చంద్రాగార్డెన్స్‌లో తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాదిమి శివకుమార్ ఆధ్వర్యంలో దసరా అలయ్,బలయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత అమ్మవారికి పూజలు నిర్వహించారు. దసరా పండుగ సందర్భంగా ఒకరికి మరొకరు జమ్మిని ఇచ్చుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రతి సంవత్సరం అలయ్,బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా శివకుమార్ వెల్లడించారు. పట్టణంలోని సుమారు 65 మంది ప్రముఖులు పాల్గొని, పిండివంటలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాంరెడ్డి, కాట్రేపల్లిలక్ష్మయ్య, వెంకట్‌రావు, డాక్టర్ లతీఫ్, జంగయ్య డాక్టర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిగినా, చర్యలు తీసుకోని వైనంపై డీఈఓకు ఫిర్యాదు

జడ్చర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనంలో గుడ్లు ఇవ్వడంలేదంటూ కలెక్టర్‌కు విద్యార్థులు చేసిన ఫిర్యాదు అంశంలో విచారణ జరిగినా, చర్యలు తీసుకోలేదంటూ తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ సభ్యులు భరత్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రతులను జడ్చర్లలో విలేకరుల అందచేశారు. గతనెల 25న కలెక్టర్‌కు పాఠశాల విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో 26న జిల్లా అధికారి విచారణ చేపట్టారని, నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

విద్యార్థులకు గుడ్లు ఇవ్వకుండానే, ఇచ్చినట్లుగా మూడు నెలల పాటు బిల్లులను ఎమ్మార్సీకి పంపారని, బిల్లులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

భూత్పూర్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతులమడుగు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఆంజనేయులు గౌడ్(76) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోమవారం తెల్లవారు జామున చనిపోయారు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఆంజనేయులు మృతి విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, స్థానిక బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు ఆంజనేయులు పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఉపాధ్యాయుడుగా ఆంజనేయులుగౌడ్ ఎంతో మంది యువతను ఉన్నత స్థానాల్లో నిలబెట్టాడని పోతులమడుగు గ్రామస్థులు కొనియాడారు. సాయంత్రం అంత్యక్రియలు చేశారు.